భారతదేశంలో 29 వ రాష్ట్రంగా తెలంగాణ 2014 జూన్ 2 న ఆవిర్భవించింది. పది జిల్లాలతో ఏర్పడిన ఈ రాష్ట్ర వైశాల్యం 114840 చ.కి.మీ. ఇది దేశంలో 12 వ అతి పెద్ద రాష్ట్రం. 2011 లెక్కల ప్రకారం దీని జనాభా 35286757 (3.52 కోట్లు). ఈ రాష్ట్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలుసుకుందాం..

# తెలంగాణలో అతి పెద్ద జిల్లా ఏది ..?

## జనరల్ స్టడీస్

### తెలంగాణ భూగోళశాస్త్రం

ఎస్. జయకృష్ణ

### తెలంగాణ రాష్ట్ర సరిహద్దులు

తెలంగాణ రాష్ట్రానికి ఉత్తరాన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు, దక్షిణం, తూర్పున ఆంధ్రప్రదేశ్, పడమరన కర్ణాటక రాష్ట్రం సరిహద్దుగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం మొత్తం నాలుగు రాష్ట్రాలతో సరిహద్దును కలిగి ఉంది. ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేయడం వల్ల ఒడిశా రాష్ట్రంతో సరిహద్దు లేదు. హైదరాబాద్ రాష్ట్రం ఏర్పడే నాటికి కేవలం తొమ్మిది జిల్లాలే ఉన్నప్పటికీ 1978 ఆగస్టు 15 న రంగారెడ్డి జిల్లాను ఏర్పాటు చేయడం వల్ల మొత్తం పది జిల్లాలయ్యాయి. అవి... మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, ఖమ్మం, నల్గొండ, వరంగల్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్.

- జిల్లాలవారీగా విస్తీర్ణం ప్రకారం మహబూబ్‌నగర్ 18432 చ.కి.మీ.తో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉంది. 217 చ.కి.మీ. విస్తీర్ణంతో హైదరాబాద్ చివరి స్థానంలో ఉంది.

| జిల్లా | 2011 లెక్కల ప్రకారం జనాభా | జనసాంద్రత |
|---|---|---|
| ★ రంగారెడ్డి | 5296741 | 707 |
| ★ మహబూబ్‌నగర్ | 4053028 | 219 |
| ★ హైదరాబాద్ | 3943323 | 18172 |
| ★ కరీంనగర్ | 3776269 | 319 |
| ★ వరంగల్ | 3512576 | 273 |
| ★ నల్గొండ | 3488809 | 245 |
| ★ మెదక్ | 3033288 | 313 |
| ★ ఖమ్మం | 2797370 | 175 |
| ★ ఆదిలాబాద్ | 2741239 | 170 |
| ★ నిజామాబాద్ | 2551335 | 325 |




- జనసాంద్రత పరంగా హైదరాబాద్ మొదటి స్థానంలో, ఆదిలాబాద్ చివరి స్థానంలో ఉన్నాయి.
- పరిపాలనా సౌలభ్యం కోసం 10 జిల్లాలను 42 రెవెన్యూ డివిజన్లుగా, 464 రెవెన్యూ మండలాలుగా, 10761 రెవెన్యూ గ్రామాలుగా విభజించారు. రాష్ట్రంలో మొత్తం 6 మున్సిపల్ కార్పొరేషన్లు, 9 జిల్లా పరిషత్‌లు, 38 మున్సిపాలిటీలు ఉన్నాయి.

### నైసర్గిక స్వరూపం

తెలంగాణ రాష్ట్రం భారతదేశ పీఠభూమి అయిన దక్కన్‌లో విస్తరించి ఉంది. ఇది 15° 55' నుంచి 19° 55' ఉత్తర అక్షాంశాల మధ్య, 77° 22' నుంచి 81° 2' తూర్పు రేఖాంశాల మధ్య విస్తరించి ఉంది.

- తెలంగాణ పీఠభూమి అంతటా పురాతన ఆర్కియన్ శిలలను గ్రానైట్, నైసిస్ రూపంలో చూడొచ్చు.
- ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో దిగువ గోదావరి నది వెంబడి అనేక ముడతలుపడిన గోండ్వానా శిలలు బొగ్గు ఖనిజాలతో ఉన్నాయి. ఈ పీఠభూమి ఉపరితలాన్ని పరిశీలిస్తే ఎర్రటి ఇసుక రేణువులతో చాలా పెద్ద మొత్తంలో గోధుమ వర్ణపు కొండలతో, రుతుపవన సంబంధ నదీ ప్రవాహాలతో, చెరువులతో ఉంటుంది.
- ఏడాదిలో ఎక్కువ భాగం ఎండిపోయే వాగులు, నదులు చిన్న చిన్న లోయలు ఈ పీఠభూమిలో ఉన్నాయి.
- తెలంగాణ పీఠభూమి పశ్చిమ భాగంలో బసాల్ట్ శిలలను అధికంగా చూడొచ్చు. ఈ ప్రాంతంలో 'లావా' ద్రవం పొరలు పొరలుగా భూ ఉపరితలంపై ప్రవహించి ఘనీభవించి దక్కన్ నాపలుగా ఏర్పడింది. (Deccan Traps).
- ఈ నాపలను వికారాబాద్, పశ్చిమ తెలంగాణ అంతటా చూడొచ్చు ఇక్కడ నల్లరేగడి నేలలు ఈ లావా ప్రవాహ ఫలితమే.
- ఈ పీఠభూమి సముద్ర మట్టానికి 500 - 600 మీటర్ల ఎత్తులో ఉంది. హైదరాబాద్ - వరంగల్ మధ్య దీని ఎత్తు సుమారు 700 మీ. వరకు ఉంటుంది.
- దక్షిణాన కృష్ణా - తుంగభద్ర మధ్యన దీని ఎత్తు 300 - 400 మీటర్లు. అంటే ఈ పీఠభూమి తూర్పునకు వాలి ఉంది. కాబట్టే గోదావరి, కృష్ణా, తుంగభద్ర నదులు తూర్పునకు ప్రవహిస్తున్నాయి.
- ఈ ప్రాంతంలో కొన్ని గుట్టలు వ్యాపించి ఉన్నాయి. వీటిని వివిధ జిల్లాల్లో వివిధ పేర్లతో పిలుస్తున్నారు.
- ఈ పీఠభూమి మధ్య భాగంలో హైదరాబాద్ నెలకొని ఉంది. దీని ఎత్తు సుమారు 600 మీటర్లు.

### తెలంగాణలోని గుట్టలు:

- ★ ఆదిలాబాద్ - నిర్మల్ గుట్టలు
- ★ కరీంనగర్ - రాఖీ గుట్టలు
- ★ వరంగల్ - కంగల్ గుట్టలు
- ★ ఖమ్మం - రాజుగుట్టలు, యల్లండ్లపాడ్
- ★ నిజామాబాద్ - సిర్నపల్లి పంక్తులు
- ★ మహబూబ్‌నగర్ - షాబాన్ గుట్టలు, అమ్రాబాద్ గుట్టలు.

| జిల్లా | వైశాల్యం (చ.కి.మీ.) | రెవెన్యూ మండలాలు |
|---|---|---|
| ★ మహబూబ్‌నగర్ | 18432 | 64 |
| ★ ఆదిలాబాద్ | 16105 | 52 |
| ★ ఖమ్మం | 16029 | 37 |
| ★ నల్గొండ | 14240 | 58 |
| ★ వరంగల్ | 12846 | 40 |
| ★ కరీంనగర్ | 11823 | 57 |
| ★ మెదక్ | 9699 | 46 |
| ★ నిజామాబాద్ | 7956 | 36 |
| ★ రంగారెడ్డి | 7493 | 37 |
| ★ హైదరాబాద్ | 217 | 16 |

(గణాంకాలకు ఆధారం: తెలంగాణ ప్రభుత్వ వెబ్‌సైట్)

### నమూనా ప్రశ్నలు

1. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ఎన్ని రాష్ట్రాలతో సరిహద్దును కలిగి ఉంది?
   ఎ) 3 రాష్ట్రాలు బి) 4 రాష్ట్రాలు
   సి) 5 రాష్ట్రాలు డి) 6 రాష్ట్రాలు
2. రంగారెడ్డి జిల్లా ఏ తేదీన ఏర్పడింది?
   ఎ) 12 ఆగస్టు 1976 బి) 12 ఆగస్టు 1977
   సి) 15 ఆగస్టు 1978 డి) 12 ఆగస్టు 1979
3. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్ర జనాభా ఎంత?
   ఎ) 3.52 కోట్లు బి) 3.1 కోట్లు
   సి) 3.9 కోట్లు డి) 3.0 కోట్లు
4. అమ్రాబాద్ గుట్టలు ఏ జిల్లాలో విస్తరించి ఉన్నాయి?
   ఎ) రంగారెడ్డి బి) హైదరాబాద్
   సి) ఖమ్మం డి) మహబూబ్‌నగర్
5. తెలంగాణలోని ఏ ప్రాంతంలో దక్కన్ నాపలను అధికంగా చూడొచ్చు?
   ఎ) తూర్పు ప్రాంతం బి) పశ్చిమ ప్రాంతం
   సి) ఉత్తర ప్రాంతం డి) దక్షిణ ప్రాంతం
6. తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా మండలాలున్న జిల్లా ఏది?
   ఎ) మహబూబ్‌నగర్ బి) ఖమ్మం
   సి) వరంగల్ డి) ఆదిలాబాద్
7. 2011 జనాభా లెక్కల ప్రకారం అత్యధిక జనసాంద్రత ఉన్న జిల్లాల్లో మొదటిది హైదరాబాద్ అయితే రెండో జిల్లా ఏది?
   ఎ) మెదక్ బి) ఆదిలాబాద్
   సి) రంగారెడ్డి డి) మహబూబ్‌నగర్
8. వైశాల్యపరంగా తెలంగాణ భారతదేశంలో ఎన్నో అతి పెద్ద రాష్ట్రం?
   ఎ) 10 బి) 20 సి) 18 డి) 12
9. ఏ రాష్ట్రంతో తెలంగాణ రాష్ట్రానికి అత్యధిక సరిహద్దు ఉంది?
   ఎ) మహారాష్ట్ర బి) కర్ణాటక
   సి) ఛత్తీస్‌గఢ్ డి) ఆంధ్రప్రదేశ్
10. తెలంగాణలో అతిపెద్ద జిల్లా ఏది?
    ఎ) మహబూబ్‌నగర్ బి) నిజామాబాద్
    సి) ఆదిలాబాద్ డి) ఖమ్మం
11. తెలంగాణ రాష్ట్రం అవతరించిన తేదీ ఏది?
    ఎ) జులై 2, 2014 బి) జనవరి 2, 2014
    సి) జూన్ 2, 2014 డి) ఆగస్టు 2, 2014
12. ఆంధ్రప్రదేశ్‌లోని అత్యధిక జిల్లాలతో సరిహద్దు కలిగి ఉన్న తెలంగాణ జిల్లా ఏది?
    ఎ) మహబూబ్‌నగర్ బి) ఖమ్మం
    సి) నల్గొండ డి) ఆదిలాబాద్
13. తెలంగాణలో అత్యల్ప జనసాంద్రత ఉన్న జిల్లా ఏది?
    ఎ) ఆదిలాబాద్ బి) కరీంనగర్
    సి) వరంగల్ డి) నిజామాబాద్
14. తెలంగాణ రాష్ట్రంలో ఎన్ని మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి?
    ఎ) 5 బి) 6 సి) 8 డి) 2
15. హైదరాబాద్ సముద్ర మట్టానికి సుమారు ఎన్ని మీటర్ల ఎత్తులో ఉంది?
    ఎ) 600 మీ బి) 100 మీ
    సి) 1000 మీ డి) 1600 మీ

### జవాబులు

| | | | | |
|---|---|---|---|---|
| 1–బి | 4–డి | 7–సి | 10–ఎ | 13–ఎ |
| 2–సి | 5–బి | 8–డి | 11–సి | 14–బి |
| 3–ఎ | 6–ఎ | 9–డి | 12–బి | 15–ఎ. |